TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

సంపుటి : 3 సంచిక : 215 | మంగళవారం 28-07-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

# ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

## ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకం ప్రారంభిస్తున్నాం



- విద్యార్థుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం
- అల్పాహార పథకాన్ని ప్రారంభించిన డిప్యూటి సిఎం భట్టి

తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్దిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. మధిర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని, మహిళలకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు.



## రెండు వారాల్లోగా నివేదిక సమర్పించండి:

### అయోధ్య విరాళాల చోరీపై సుప్రీం



- అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ వ్యవహారానికి సంబంధించిన కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.

## ఆ నియామకాలు చెల్లవ్..

### విజయ్ సర్కార్‌కు హైకోర్టులో షాక్



- కరూర్ బాధితులకు ఇచ్చిన ఉద్యోగాలు చెల్లవ్: హైకోర్టు
- ప్రభుత్వ ఉద్యోగాలు నిబంధనల ప్రకారమే ఇవ్వాలి
- ఉద్యోగాలు ఉచితంగా పంచిపెట్టేవి కావు: కోర్టు
- విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ
- 32 మందికి ఇచ్చిన తాత్కాలిక నియామకాలు రద్దు

## కుప్పం అభివృద్ధికి

### సీఎం చంద్రబాబు కృషి: నారా భువనేశ్వరి

- రామకుప్పం మండలంలో నారా భువనేశ్వరి ముఖాముఖి
- తాండాలకు రూ.75 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం
- ఒకేసారి 30 పరిశ్రమల ద్వారా వేలమందికి ఉపాధి
- మహిళలు నైపుణ్య శిక్షణ ద్వారా ఎదగాలి
- కృష్ణా జలాలతో నెరవేరిన దశాబ్దాల తాగునీటి కల

2లో





### డీఎస్సీపై బహిరంగ చర్చకు సిద్ధం..

## జగన్‌కు లోకేశ్ సవాల్

కంకిపాడు: వైకాపా అధ్యక్షుడు జగన్‌కు మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. డీఎస్సీ అంశంలో జగన్ చేస్తున్న ఆరోపణలపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. వైకాపా హయాంలో జరిగిన మద్యం, భూకుంభకోణాల పైనా చర్చిద్దామన్నారు. కృష్ణా జిల్లా కంకిపాడులో తెదేపా నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో లోకేశ్ మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం తెదేపా సిద్ధాంతమని.. విధ్వంసం, అసభ్య పదజాలమే గొడ్డలి పార్టీ విధానమని ఎద్దేవా చేశారు.

## అర్హులందరికి సంక్షేమ పథకాలు

- రెండేళ్ల పాలనలపై ప్రచారంలో మంత్రి అనిత



అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట మండలం పాల్మన్ పేటలో 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. కరపత్రాలు పంచారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం సమ ప్రాధాన్యంతో సాగుతున్నాయని వివరించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిరునామాగా మారుతుందని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గం పరిశ్రమలకు పర్యాటక రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్,పెద్దిరెడ్డి చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై

## రైతుల్లో అవగాహన కల్పించాలి: సీఎం చంద్రబాబు

### రైతుల్లో ఎల్‌నినో అవగాహనకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు

- పంటల బీమా యాక్షన్ ప్లాన్ సమర్థవంత అమలు
- ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మార్పు
- విద్యార్థులకు సైకోమెట్రిక్ టెస్టులు, ఉపాధ్యాయులకు శిక్షణ
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు



రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి విభిన్న శాఖల పనితీరుపై ఆయన సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులను చైతన్యపరిచేందుకు క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఎల్‌నినో వల్ల కలిగే పరిణామాలను వివరిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని, ఏ ప్రాంతంలో ఏయే పంటలు వేయాలో రైతులకు స్పష్టతనివ్వాలని తెలిపారు.. పేజి 2లో ▶

### మాజీ ఎమ్మెల్యే పెద్దికి

## కెసిఆర్ పరామర్శ



ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మాజీ సిఎం

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించేందుకు ఎర్రవెల్లిలోని నివాసం నుండి బయలుదేరి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. కేసీఆర్ యశోద ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. పేజి 2లో ▶

# సంపాదకీయం

## సామాజిక విపత్తులతో సంఘర్షణే నా రచన!






జూపాక సుభద్ర సాహిత్యంలో చండాలిక! మారుమూల గ్రామం నుంచి తెలుగు సాహిత్యంలోకి దూసుకొచ్చిన పల్లె చుక్క. సంపద్వంతమైన తెలంగాణ జీవభాషతో తెలుగు సారస్వతానికి సొగసులద్దిన విద్యుత్తేజం. మెరుపుల ముక్కు పుల్లలు పోగొట్టుకున్న అవ్వల, అక్కల, బిడ్డల నేలలో నిత్య సాంస్కృతికాన్వేషి. చరిత్ర యాదుల భద్రాక్షరి. తెలుగు సాహిత్యంలో కడ మనుషుల జీవన సౌందర్యాలను గునుగుపూలై పూసిన తెలంగాణి. అట్టడుగు నుంచి అధికారి దాకా ఎదిగిన తన ఆత్మకథనమ్ 'గునుగుపూలు' విడుదలైన సందర్భంగా ఆమెతో సంభాషణ.

నాకు అక్షర జ్ఞానం అందిన కాన్నుంచి ఎటు చూసినా, ఏమి చదివినా మాది గాని భాషలో, మావి కాని జీవితాలు కవిత్వంగా, కథలుగా, నవల్లుగా, నాటకాలుగా, నాట్యాలుగా, గాత్రాలుగా, మా చుట్టూతా ఆవరించి వున్నయి. సమాజంలో చూస్తే, శ్రామిక జాతులు బహుళంగా ఉన్నాయి, కొన్ని విశ్రాంతి జాతులున్నాయి. సమాజంలో నానాజాతి సమూహాలున్నా విశ్రాంతి జాతుల చరిత్రలు, సాహిత్యాలు, కళలు, వారి ఆచార సంప్రదాయాలనే తిప్పించి, మల్లిచ్చి వాటినే సాహిత్యాలు, కళలు, చరిత్రలుగా చెబుతున్నాయి, రాస్తున్నాయి, ప్రచారం చేస్తున్నాయి. ఆ విశ్రాంతి జాతులు ఎంతగా మాయ చేస్తున్నారంటే, మా సాహిత్యాలు, కళలు, చరిత్రల నుంచి మేము పరాయీకరణ చెందేట్టుగా. శ్రమజాతుల్లో కూడా అట్టడుగు, అంటరాని జాతులు ఎట్లా బతికినయి? వారి ఆచార సంప్రదాయాలు, పుట్టుకలు, పురుల్లు, మందు మాకులు, పెండ్లి పేరంటాలు, ఆటలు, పని పాటలు.... ఇవేవీ 'మెయిన్ స్ట్రీమ్ చరిత్ర' చెంపకానలే. సాహిత్యాల సరసకు చేరలే. ఈ దేశంలో నేనెవరినీ...? నేను నడిచొచ్చిన దారుల్ని, యెదిగొచ్చిన యెన్నెలని, సాహితీ లోకానికి బొమ్మకట్టి పటమేసిన నా ఆత్మకథనమే 'గునుగుపూలు'.

**మీ సాహిత్యంలో అట్టడుగు కుల, జెండర్ జీవితాలకు కనిపించే ప్రాధ్యాన్యతకు నేపథ్యం?**

నా జీవితం -- సాహిత్యం వేరువేరు కావు. నా సాహిత్యానికి నా అనుభవాలే ప్రమాణం. ఎనుకటి ఏడు తరాల్లో, ముందు మూడు తరాల్లో బూములు, చదువులు, ఉద్యోగాలు, బతుకు దెరువు లేని, అంటరాని, ఎట్టి మాదిగ మహిళను. కుండలు, దొంతులు, బోకెలు, సిప్పలు దప్పా, కన్ను బొడుసుకున్నా, కాయితమ్ముక్క కనబడని యిలవరసలున్న ఇల్లు మాది. నా ఎండా కాలం నీటి బుడగ లాంటి చదువుకు, ఏ సన్నగాలి సకిలించినా, మటాష్. నా చదువు ఆగకుండా, ఆఖరి దాకా సాగడం అద్భుతమే. నా పూర్తి జీవితం ఉద్యమాల్లోనే అమరత్వం అనుకుంటే, ప్రభుత్వ పాలనా వ్యవస్థలు నడిపే ఆఫీసరమ్మ నైతానని, వీటన్నింటి కంటే, కవయిత్రిని, రచయిత్రినవుతానని అవ్వ తోడు ఏనాడూ కలగనని కత.

భారత సామాజిక ఉత్పత్తి రంగంలో శ్రమశక్తిగా వున్నదంతా బహుజన కులాల మహిళలే. రోడ్లు ఊడ్చే మునిసిపల్ వర్కర్స్, కక్కోసులు కడిగే సఫాయి కార్మికులు, ఇండ్లల్లో పని మనుషులు, కులం పేరుతో లైంగిక వెట్టికి గురయ్యే జోగినీలు, వ్యవసాయ కూలీలు, అడ్డా కూలీలు, తట్టలు మోసే లేబర్ పనోళ్ళు, మట్టి పనోల్లు, అసంఘటిత రంగాల్లో గౌరవం, ఆర్థిక విలువ లేని హీన రూపాలుగా చూడబడుతున్న శ్రమల్లో, మార్జినలైజ్ చేయబడిన మహిళలు నా రచనా వస్తువులు. నా జీవితం చుట్టూ కుల, జెండర్ వివక్షలు, అణచివేతలను ప్రతిఘటిస్తున్న పరిస్థితులు, మనుషులే నా సాహిత్య వస్తువులయ్యాయి.

**రచయిత్రిగా ఎదిగే క్రమంలో ఏమైనా అవాంతరాలు?**

జీవితంలో నిరాటంకంగా చదివినాను, ఉన్నతోద్యోగిగా ఎదిగినాను, రచయిత్రిగా నిలబడినానంటే, ఇదంతా నా ఒక్కదాని వల్లే జరగలేదు, చాలామంది నా వెనుక నిలబడ్డారు. వాళ్లంతా నాకు సదా యాదులు. కులం, జెండర్ నిరంతర వివక్షలు, అణచివేతలు నాకు మానని గాయాలు. ఆ గాయాల అనుభవాలను చెప్పుకోవడం, రాతల్లో వ్యక్తం కానివ్వడం, ఈ దేశంలో అంత సులువు కాదు. తెలుగు సాహిత్య చరిత్రలో మాదిగ మహిళ అస్తిత్వ గొంతు బలంగా కనిపించదు. నేను ఉద్యోగినైనపుడు, దళిత ఉద్యోగినని నా సర్టిఫికెట్ పత్రాల వల్ల తెలిసినా ఉద్యోగ సమాజం ఆ విషయాన్ని బాహ్యంగా ప్రస్తావించదు కానీ, సాహిత్య సమాజం మాత్రం 'దళిత రచయిత్రి'నని నా సామాజిక పరిధిని తగ్గిస్తుంది! ప్రపంచ రచనా ప్రస్థానంలో నేనూ, నా అస్తిత్వం లేదనే వేదన చాలా కుంగదీస్తుంది. సామాజిక ధర్మాగ్రహం తెప్పిస్తుంది.

నోటి సాహిత్యమే గాని, రాత సాహిత్యానికి వందల మైళ్ళ దూరంగా వున్న జాంబవ సమాజం నుంచి వచ్చిన రచయిత్రిని. అందుబాటులో వున్న సాహిత్యాన్ని చదవడమే గాక, నేను అధ్యయనంలో మునగడానికి ఎన్నెన్నో అసాధారణ పరిస్థితులు పురికొల్పినయి. సాహిత్యమంటే, ప్రయోజనాలంటే ఏమిటో తెలియని అవస్థ! నిజానికి అధ్యయనాన్ని మించి-- నేనెవరిని? నా సామాజిక జెండర్ స్థితి ఏమిటి? అనే వాస్తవిక అనుభవాలే నాకు ప్రశ్నించేటట్లు నేర్పినయి. సామాజిక విపత్తులతో సంఘర్షణలే నా రచనలు. వీటిని మెచ్చుకొని, మెడల మీద వేసుకుని, ప్రోత్సహించిన పత్రికలు లేకుండె. బాగా లేవనీ, నాసిరకం రచనలనీ, అర్థం కాని భాషనీ అచ్చుకు నిరాకరించిన, నిరుత్సాహపరిచిన నీరసాలే చాలా కాలమ్ వెంబడించినయి. తర్వాత్తర్వాత నా రచనలకు దొరికిన ప్రోత్సాహాలు మర్చిపోలేనివి.

**ప్రత్యేకంగా తెలంగాణ తెలుగులో రాసే మీ రచనల్లో భాషా సమస్యలు?**

చాలామంది "మీ భాష మార్చండి, చదువుకున్నారు కదా, చదువుకున్న భాషలో రాయండి. మీ తెలంగాణ అర్థం కావట్లేదు. మీ సాహిత్యం విస్తృతంగా అందరికీ అందాలంటే, తెలంగాణ మాండలికంలో కన్నా, మెయిన్ స్ట్రీమ్ తెలుగులో రాయండి" అనేవారు. భాష, బతుకు వేరు వేరు ఉండవు. పాలేరు భూస్వామి భాష మాట్లాడగలడా? అటెండర్‌కు ఆఫీసరు భాష అంటుతుందా? బాంచ భాష, బాసు భాష జమీన్ ఆస్మాన్ ఫరకు! భాషకు కులం, మతం, ప్రాంతం, జెండర్, చిన్న, పెద్ద, ధనిక, పేద ఉంటాయి. బూతులు ఉన్నాయని, అర్థం కావని, మా రచనలను చీకటి చేసింది ఆంధ్ర ఆధిపత్య మెయిన్‌స్ట్రీమ్ సాహిత్యం. ఆశ్చర్యమేంటంటే, తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నంక తెలంగాణ శిష్టులు "మీ పల్లె భాషని మార్చుకోండి ఎవరికర్తమైతది? శిష్ట తెలంగాణ వ్యవహారికం రాయండి" శిష్టభాష అనడంలోనే కులం ఉంది. ఇప్పుడు గూగుల్, ఏఐ టెక్నాలజీలు వచ్చాక కూడా భాష మీద కులమే అధిపత్యం చేస్తున్నది. 'చెప్పు' అని అడిగితే పాదరక్ష అని జవాబిస్తది ఏఐ. తెలంగాణ మాండలిక పదాలు గూగుల్, ఏఐ లలో ఉండకపోవడం కూడా మా భాష మీద జరుగుతున్న కులవివక్షే! మా తెలంగాణ మట్టి భాషని ఒకవైపు ఆధిపత్య భాషా సంస్కృతులు అడ్డుకుంటుంటే, ఇప్పుడు టెక్నాలజీ అడ్డుకుంటున్నది. భాషా వివక్ష చావలేదు. ఆ వివక్ష డిజిటలైజ్ అయింది.

**మొదటి కథ 'శుద్ధి చెయ్యాలె' నుంచీ, ఇప్పుడు 'గునుగుపూలు' ఆత్మకథనమ్ వరకూ సాగిన మీ సాహిత్య ప్రస్థానం గురించి?**

ప్రభుత్వ కళాశాలలో పాఠాలు చెబుతున్న కాలంలో, నా కులమేమిటో తెలిసి అద్దింటి యజమాని, నా సామాన్లు బైట పడేయించిన అవమానం నన్ను తీవ్రంగా గాయపరిచిన కథే 'శుద్ధి చెయ్యాలె'. పైటలు తగలేయాలనీ నినదిస్తుంటే, శ్రమ మహిళలకు కొంగు బొచ్చె మీద కావలి వుండదని అది సర్వ శ్రమలు చేస్తుందనీ, డప్పు తయారీలో మాదిగ మహిళ లున్నా దాన్ని వాయించే కాడ నిషేధాలున్న కవిత్వమే 'అయ్యయ్యో దమ్మక్క' సంపుటి. మా జీవితాలను బయటివారు రాసే కంటే, ఎవరి గాయాల లోతులను వారు రచనల ద్వారా వ్యక్తం చేయడమే సరైనదని అంబేద్కర్ ఉద్య మాల ద్వారా వచ్చిన చైతన్యంతో, నా స్వీయ అనుభవాలు, నా చుట్టూత అల్లుకున్న అట్టడుగు మనుషుల జీవితానుభవాలతో వచ్చిందే 'రాయక్క

## హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం

**రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు: ఆర్ఎస్**



హైదరాబాద్,జూలై27: వరుస వివాదాల నేపథ్యంలో హైకోర్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలని చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేయడంపై బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. ఇది ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. రంగనాథ్ మీదున్న 63 కోర్టు ధిక్కరణలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఉన్నత న్యాయ స్థానం ఇన్ని ఉల్లంఘలనకు పాల్పడుతున్న అధికారిని ఇంకా కొనసాగిస్తే రూల్ ఆఫ్ లా అదుపు తప్పుతుందని, రంగనాథ్ స్థానంలో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని హైకోర్టు తెలిపిందన్నరు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంపదెబ్బలాంటిదన్నారు. రేవంత్ రెడ్డికి ఏ మాత్రం కూడా తెలంగాణను పరిపాలించే నైతిక అర్హత లేదని ఇవాళ హైకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా తేలిపోయింది. లక్షమంది పోలీసులున్న ఈ రాష్ట్రంలో హోంమంత్రి అయిన సిఎం హైకోర్టు స్థానిక పోలీసులెవరూ కూడా తెలంగాణ ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడలేరు. అందుకు ఆర్మీ అధికారులను ఆదేశించింది.. అంటే అసలు మీకు ఇక నైతిక హక్కు ఎక్కుడుందని ప్రశ్నించారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేతల ప్రభుత్వం. విధ్వంసకర ప్రభుత్వం. లగచర్లలో, వెలుగుమట్లలో నాశనం చేశారు. సున్నం చెరువు పేరుతో, బహదూర్ గూడ పేరుతో, లోతుకుంటలో ఎక్కడ చూసినా విధ్వంసమే. ఆ విధ్వంసం చేస్తూనే మరోవైపు పేదల భూములను మీ సొంత సోదరులు, మీ కాంగ్రెస్ పార్టీ నాయకులంతా కబ్జాలు చేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. హైడ్రాను అడ్డం పెట్టుకుని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూభారతి పోర్టల్‌ను తీసుకొని దొడ్డి దారిన దాదాపు 22 వేల ఎకరాల భూముల హక్కులను రాత్రికి రాత్రే ఎమ్మార్వో, ఆర్డీవోల సంతకాలు లేకుండా బదలాయించారు. అందుకే నేను గతంలో తెలంగాణ ప్రభుత్వంలో పనిచేసిన మీ అధికారిగా, సోదరుడిగా, ప్రభుత్వ అధికారులకు చెబుతున్నా దయచేసి రాజ్యాంగాన్ని పాటించండి. చట్టాన్ని పాటించండి.. కోర్టులు ఇచ్చిన ఆదేశాలను దయచేసి అతిక్రమించకండని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు.


## విదేశీ యువతి పట్ల అసభ్య ప్రవర్తన

**హైదరాబాద్ టెక్కీపై పోలీసుల కేసు నమోదు**

హైదరాబాద్,జూలై27: కొండాపూర్ ప్రాంతంలో విదేశీ యువతి పట్ల ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన వెలుగులోకి వచ్చింది. నెదర్లాండ్స్‌కు చెందిన యువతి తన బాయ్‌ఫ్రెండ్‌ను కలిసేందుకు మార్చి నెలలో భారత్‌కు వచ్చింది. ఆయువతి.. తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి నివసిస్తుండగా, అదే ఇంట్లో మరో యువకుడు ఆదిత్య ఆనంద్ ఉంటున్నాడు. అతడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బాయ్‌ఫ్రెండ్ ఇంట్లో లేని సమయంలో ఆదిత్య ఆనంద్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడని నెదర్లాండ్స్ యువతి ఆరోపణలు చేసింది. యువకుడి చేష్టలతో విసిగిపోయిన యువతి.. భారత్ నుంచి తిరిగి నెదర్లాండ్స్‌కు వెళ్లి అక్కడి ఎంబసీకి ఫిర్యాదు చేసింది. మూడు రోజుల క్రితం యువతి తిరిగి హైదరాబాద్‌కు వచ్చింది. జరిగిన విషయాలన్నింటినీ గచ్చిబౌలి పోలీసులకు వివరించింది. యువతి ఫిర్యాదు ఆధారంగా ఆదిత్య ఆనంద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ప్రస్తుతం యువకుడు పరారీలో ఉన్నాడు. యువకుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## విద్యార్థిని శివాని ఆత్మహత్యపై చంద్రబాబు షాక్

**తీవ్రంగా కలచివేసిందంటూ ఎక్స్‌లో పోస్ట్**



అమరావతి,జూలై27: పోలవరం జిల్లా ఈర్లపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థిని ముర్రం శివాని ఆత్మహత్య చేసుకోవడంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మెగా పీటీఎంలో ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన విద్యార్థిని మృతి తనను కలచివేస్తోందన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. పదో తరగతి విద్యార్థిని ముర్రం శివాని తనువు చాలించడం నన్ను తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. రంపచోడవరంలో నిర్వహించిన మెగా పీటీఎంలో వేదికపై ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన విద్యార్థిని బలవన్మరణం ఆవేదన కలిగించింది. ఆరోజు తన చదువు, ఉన్నత లక్ష్యాల గురించి శివాని నాతో చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏవైనా తన కలలు నిజం కాకుండానే ఆ విద్యార్థిని దూరమవడం కలచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించాను. సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవరూ ఒత్తిడి, నిరాశ, నిస్పృహలకు లోను కావొద్దు. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధ, ఆవేదనను కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆత్మీయులతో పంచుకోండి. ఒత్తిడిని అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్ని విధాలుగా మీకు అండగా ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. రంపచోడవరం మెగా పీటీఎంలో ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడిన శివాని మృతి తీవ్ర విషాదాన్ని నింపిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'విషయం తెలిసినప్పటి నుంచి శివాని మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి. సోదరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. ఎంత కష్టమైనా పోరాడుదాం.. ఎంతటి సమస్యనైనా ఎదుర్కొందాం.. మీకు నేనున్నాను.. ఈ ప్రభుత్వం ఉందని లోకేశ్ పేర్కొన్నారు.

## భక్తుడికి గుండెపోటు.. సీపీఆర్ చేసి కాపాడిన ఎస్సై



కోటనందూరు: సమయానికి సీపీఆర్ చేసి ఓ భక్తుడి ప్రాణాలు ఎస్సై కాపాడారు. కాకినాడ జిల్లా తుని మండలం తలుపులమ్మ లోవ ఆలయానికి ఆదివారం అమలాపురం నుంచి ఓ భక్తుడు భార్యతో కలిసి అమ్మవారి దర్శనానికి వచ్చారు. దర్శనం అయిన తర్వాత తిరిగి వెళ్తుండగా ప్రధాన రహదారిపై ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడే విధుల్లో ఉన్న కోటనందూరు ఎస్సై రామకృష్ణ భక్తుడికి సీపీఆర్ చేశారు. కొద్ది సెకన్లు సీపీఆర్ చేయడంతో భక్తుడు స్పృహలోకి వచ్చాడు. వెంటనే తుని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించడంతో వైద్యులు చికిత్స అందించడంతో కోలుకున్నాడు.

## ఎల్‌నినో ప్రభావంపై

**రైతుల్లో అవగాహన కల్పించాలి: సీఎం చంద్రబాబు**

మొదటిపేజీ తరువాయి

**ఉద్యోగుల పనితీరు మారాలి**

మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవల అందజేతలో కొంత వ్యత్యాసం ఉందని పేర్కొన్న ముఖ్యమంత్రి, ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మారాలని స్పష్టం చేశారు. ఆలూరు నియోజకవర్గ పర్యటన సందర్భంగా క్షేత్రస్థాయిలో ఉద్యోగుల తీరుపై ప్రజల నుంచి వచ్చిన ప్రతిస్పందనను అధికారులకు వివరించారు. అదేవిధంగా పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు

**విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై దృష్టి**

రంపచోడవరంలో విద్యార్థిని శివాని ఆత్మహత్యకు పాల్పడటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిస్థితులను అంచనా వేసేందుకు సైకోమెట్రిక్ టెస్టులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వివరించారు. ఈ ప్రక్రియలో నిపుణుల సేవలు వాడుకోవడంతో పాటు ఉపాధ్యాయులకు తగిన శిక్షణ ఇవ్వాలని సీఎం తెలిపారు.

**ఉన్నతాధికారుల భాగస్వామ్యం**

ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రెండు వారాల్లోగా నివేదిక సమర్పించండి:

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ వ్యవహారానికి సంబంధించిన కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ ఘటనపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని కేసును దర్యాప్తు చేస్తున్న 'సిట్' అధికారులను ఆదేశించింది. ఈ బృందంలో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా చేర్చాలని పేర్కొంది. విరాళాల నిధుల మళ్లింపు, రికార్డుల తనిఖీకి ఫోరెన్సిక్ నిపుణుడి అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఆలయ విరాళాల వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టాలన్న పిటిషనర్ విజ్ఞప్తిపై స్పందిస్తూ.. ప్రస్తుతం తమ దృష్టి అంతా దర్యాప్తుపైనే ఉందని వ్యాఖ్యానించింది. సిట్ నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసుపై సోమవారం విచారణ చేపట్టింది. యూపీ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. సిట్ అధికారులు, యూపీ పోలీసులు ఈ ఘటనపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారని..దర్యాప్తులో తేలిన విషయాలను త్వరలో ధర్మాసనం దృష్టికి తీసుకువస్తామని కోర్టుకు వివరించారు. కాగా ఈ కేసును సీబీఐ, కాగ్‌తో విచారణ జరిపించాలని పలువురు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

## ఆ నియామకాలు చెల్లవ్..

మొదటిపేజీ తరువాయి

చెన్నై: విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కరూర్ తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఇచ్చిన ఉద్యోగాలు చెల్లవని ఉన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. రాజ్యాంగ పరిమితులకు లోబడి ప్రభుత్వం వ్యవహరించాలని సూచించింది. ప్రభుత్వ చర్యలపై నియంత్రణ లేకపోతే.. అరాచకం, అశాంతి రాజ్యమేలుతాయని పేర్కొంది. "ప్రభుత్వ ఉద్యోగం అనేది ఉచితంగా పంచిపెట్టేది కాదు. దాన్ని కష్టపడి సాధించాలి. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారు" అని వ్యాఖ్యానించింది.

గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన టీవీకే (ఒఖ) ర్యాలీలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మరోసారి కరూర్ వెళ్లి అర్హతలున్న 32 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక నియామక పత్రాలను అందజేశారు.

దీనిపై అన్నాడీఎంకే నేత ఆర్.బి. ఉదయ్‌కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్టపరమైన విధానాలను పక్కనపెట్టి తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చారంటూ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో మంది యువత తీవ్రంగా శ్రమిస్తున్నారని, ప్రభుత్వం ఏ ఉద్యోగ నియమాక ప్రక్రియ చేపట్టినా తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారానే చేపట్టాలని కోరారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం సీఎం విజయ్ చేపట్టిన ఈ నియామకాలు చెల్లబోవని తీర్పునిచ్చింది.

## కుప్పం అభివృద్ధికి

**సీఎం చంద్రబాబు కృషి: నారా భువనేశ్వరి**

మొదటిపేజీ తరువాయి

కుప్పం నియోజకవర్గాన్ని సీఎం చంద్రబాబు ఎంతో అభివృద్ధి చేశారని నారా భువనేశ్వరి తెలిపారు. రామకుప్పం మండలం పీఎంకే తాండా మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 2024 ఎన్నికల్లో తాండాల్లో తెలుగుదేశం జెండా ఎగిరిందని, చంద్రబాబు విజయం తర్వాత నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు లభించిందని అన్నారు. ఒకేసారి 30 పరిశ్రమలు తీసుకురావడం ద్వారా వేలమంది స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

**తాండా సమగ్ర అభివృద్ధి**

పీఎంకే తాండాలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. పంచాయతీ పరిధిలో రూ.75 లక్షలతో సీసీ రోడ్లు, రూ.30 లక్షలతో ఇతర రహదారుల నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. తాండాలో కమ్యూనిటీ భవనం నిర్మించడంతో పాటు గోకులం షెడ్ల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరయ్యాయని వివరించారు. రూ.25 లక్షలతో ఓం శక్తి దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేసినట్లు చెప్పారు.

**తాగునీటి కల సాకారం**

గతంలో కుప్పం ప్రాంతంలో తీవ్ర నీటి ఎద్దడి ఉండేదని, చంద్రబాబు కృష్ణా జలాలు తీసుకువచ్చి ప్రజల దశాబ్దాల కలను నెరవేర్చారని చెప్పారు. నదుల అనుసంధానంతో సాగు, తాగునీరు సమృద్ధిగా అందుతోందన్నారు. ఎన్నికల హామీల మేరకు ఎన్టీఆర్ భరోసా, దీపం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, అన్నా క్యాంటీన్లు విజయవంతంగా అమలువుతున్నాయని పేర్కొన్నారు.

**మహిళా సాధికారత**

మహిళలు ఇంటికే పరిమితం కాకుండా నైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా శిక్షణ పొంది సొంతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ధైర్యంగా ముందడుగు వేస్తేనే ఏదైనా సాధించగలమని అన్నారు. సుపరిపాలన అందిస్తారనే నమ్మకంతో ప్రజలు కూటమికి విజయం అందించారని, ప్రజల నమ్మకాన్ని ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని తెలిపారు.

### మాజీ ఎమ్మెల్యే పెద్దికి

## కెసిఆర్ పరామర్శ

మొదటిపేజీ తరువాయి

పెద్ది కుటుంబసభ్యులకు కేసీఆర్ మనోధైర్యాన్ని అందించారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. రెండు రోజుల క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా.. ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు. అత్యవసర సీపీఆర్ అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డిని గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారని తెలిసిందే.

ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక 28-07-2026

# వసూళ్లకు పాల్పడిన ఆర్ ఎస్సై, కానిస్టేబుళ్ల సస్పెన్షన్

**- డబ్బులు తీసుకుని ఒకరికి బదులు మరొకరిని కోర్టుకు పంపుతూ దందా**
**- రూ.30 లక్షలకుపైగా వసూలు చేసినట్లు గుర్తింపు**




కరీంనగర్ జిల్లా ప్రజాదివాస్/ జూలై 27
కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో చిక్కిన వ్యక్తుల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేసి.. వారికి బదులు మరో వ్యక్తిని కోర్టులో హాజరుపరిచిన వ్యవహారంలో ముగ్గురు పోలీసులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ వ్యవహారంలో ఆర్ఎస్సై శనిగల శ్రీకాంత్, కోర్టు డిస్పోజల్ కానిస్టేబుల్ సాయి, ట్రాఫిక్ స్టేషన్ రైటర్ కిరణ్(పీసీ)ను సీపీ గౌష్ ఆలం సస్పెండ్ చేశారు. 130 కేసుల్లో సుమారు రూ.30 లక్షలకుపైగా వసూలు చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. కేసుల సంఖ్యతోపాటు వసూలు చేసిన మొత్తం రెట్టింపు స్థాయిలో ఉండొచ్చని పోలీస్ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. దీంతో ఇంకా లోతుగా విచారిస్తున్నారు.

**ముగ్గురు కుమ్మక్కయి గుట్టుగా వసూళ్లు**

డ్రంకెన్?డ్రైవ్?లో చిక్కినవారిపై పోలీసులు కేసులు నమోదు చేసి మరుసటి రోజు కోర్టులో హాజరుపరుస్తుంటారు. అయితే కోర్టుకు వెళ్తే జైలు శిక్ష పడుతుందనే వాహనదారుల భయాన్ని ఆసరాగా చేసుకున్న కరీంనగర్ ట్రాఫిక్ విభాగంలో పనిచేసే ఆర్ఎస్సై, స్టేషన్ రైటర్, కోర్టు కానిస్టేబుల్ వసూళ్లకు తెరలేపారు. వాహనదారుడి ఆర్థిక పరిస్థితిని బట్టి ఒక్కొక్కరి నుంచి రూ.20 వేల నుంచి 50 వేల వరకు వసూలు చేసినట్లు తెలిసింది.పట్టుబడ్డ కొందరు డాక్టర్లు, వ్యాపారులు రూ.లక్ష వరకు ముట్టజెప్పినట్టు సమాచారం. వారికి బదులు ఈ కేసుల్లో వేరొకరిని పంపి, అలా వెళ్లినవారికి ఎంతోకొంత ఇచ్చేవారు. ఈ వ్యవహారం సీపీ గౌష్ ఆలం దృష్టికి వెళ్లడంతో విచారణ చేపట్టి ఆ ముగ్గురిని మొదట హెడ్ క్వార్టర్ కు అటాచ్ చేశారు. ఎంక్వైరీ పూర్తి కావడంతో వేటు వేశారు. వీరిలో కోర్టు కానిస్టేబుల్ సాయి ఇంకా ప్రొబేషనరీ పీరియడ్‌లో ఉన్నట్లు తెలిసింది.

# ప్రజావాణికి ఫిర్యాదు వచ్చిన అరగంటలోనే కలెక్టర్ స్పందన

**- చిన్న బోనాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ**
**- ఇటీవల ఎంజేపీ బాలుర విద్యాలయం ప్రిన్సిపాల్ సస్పెండ్**
**- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిన్న బోనాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ కు హెచ్చరిక**
**- శ్రద్ధగా చదువుకోవాలని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచన**





రాజన్న సిరిసిల్ల, జూలై -27 ప్రజా దివస్
సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణిలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్న బోనాలలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో నీటి సరఫరాలో ఇబ్బందులు, ఇతర సమస్యలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వచ్చిన అరగంటలోనే స్పందించిన జిల్లా కలెక్టర్ ఆ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా డైనింగ్ హాల్ కి వెళ్లి విద్యార్థులు భోజనం చేస్తుండగా, వారితో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? నాణ్యతా ఎలా ఉంది? అని ఆరా తీశారు. బియ్యం, పప్పులు, కోడిగుడ్లు, నూనె ఇతర ఆహార పదార్థాల నాణ్యత, గడువు తేదీని తనిఖీ చేశారు. అక్కడి నుంచి విద్యార్థుల వసతి గదులకు వెళ్లి.. టాయిలెట్లు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలి విద్యాలయంలో నీటి సరఫరాలో ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా ను పిలిపించి.. జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని వేములవాడ మహాత్మ జ్యోతి బాపూలే బాలుర గురుకుల రెసిడెన్షియల్ విద్యాలయంలో జిల్లా కలెక్టర్ ఇటీవల తనిఖీ చేసి.. నిర్వహణలో లోపాలను గుర్తించారు. విచారణ నివేదిక ఆధారంగా ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిన్న బోనాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ను జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.విద్యార్థులు, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. విద్యాలయం ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రతి పాఠ్యాంశం కీలకమని ప్రణాళిక ప్రకారం చదవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. వసతులను సద్వినియోగం చేసుకొని.. విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత అవగాహనతో ఉండాలని స్పష్టం చేశారు.

# బావుసాయిపేట ఇసుక క్వారీ వద్ద రైతుల నిరసన : తవ్వకాలు అడ్డుకున్న అన్నదాతలు!

**- అనుమతి 3.5 ఎకరాలు.. తవ్వేది 10 ఎకరాలు: కోనరావుపేటలో విచ్చలవిడిగా ఇసుక దందా!**
**- వాగు ప్రవాహం దెబ్బతిని పంట భూములు కోతకు గురవుతాయని బావుసాయిపేట రైతుల ఆందోళన**
**- అక్రమ ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపివేయాలి: అధికారులకు హెచ్చరించిన కోనరావుపేట రైతులు**



కొనరావుపేట మండలం/ ప్రజాదివాస్ జూలై 27
రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలోని ఇసుక క్వారీ వద్ద సోమవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనుమతులకు మించి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారంటూ ఆగ్రహించిన స్థానిక రైతులు క్వారీ వద్దకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. నిరసన తెలపడమే కాకుండా వాహనాలు, యంత్రాలను నిలిపివేసి ఇసుక అక్రమ తరలింపుపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... క్వారీ నిర్వహణకు అధికారులు కేవలం మూడున్నర ఎకరాలకు మాత్రమే అనుమతి ఇచ్చినప్పటికీ, కాంట్రాక్టర్లు దానికి విరుద్ధంగా ఏకంగా సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారని ఆరోపించారు. పరిమితికి మించి ఇసుక తవ్వకాలు జరపడం వల్ల వర్షాకాలంలో వాగు సహజ ప్రవాహం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల వాగు పరివాహక ప్రాంతాల్లోని పంట భూములు తీవ్రంగా కోతకు గురవుతాయని, పొలాల్లోకి వరద నీరు చేరి వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటుందని వాపోయారు. అక్రమ తవ్వకాల వల్ల భవిష్యత్తులో తీవ్ర సాగునీటి ఇబ్బందులతో పాటు భూగర్భ జలాలు కూడా పాతాళానికి పడిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని, అక్రమంగా జరుపుతున్న ఇసుక తవ్వకాలను తక్షణమే నిలిపివేసి కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం.

**- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 17 ఫిర్యాదులు స్వీకరణ:ం జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**



రాజన్న సిరిసిల్ల జిల్లా జూలై 27 ప్రజా దివాస్
ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 17 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.....ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# ఘనంగా డాక్టర్ చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు



ముస్తాబాద్/ జూలై 27 ప్రజా దివాస్
ముస్తాబాద్ మండల కేంద్రంలోమాజీ టీఎస్పీఎస్సీ సభ్యులు,తిరుమల నర్సింగ్ హోం అధినేత డాక్టర్ ఎర్రవెల్లి చంద్రశేఖర్ రావు తన 66 వ జన్మదిన వేడుకలను ముస్తాబాద్ మండల తిరుమల నర్సింగ్ హోం హాస్పిటల్ లో సోమవారం విలేకరుల మధ్య ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు ఎలాంటి ఫీజు లేకుండా ఉచిత వైద్య,పరీక్షలు కంటి పరీక్షలు నిర్వహించారు నిరుపేదలకు తన జన్మదిన వేడుకల సందర్భంగా ఉచిత వైద్య సేవలు అందిస్తూ బీద ప్రజలకు 24 గంటల అందుబాటులో అందిస్తున్నామని వారు అన్నారు .ఈ కార్యక్రమములో సుంచు బాబు,కొల్లూరిశంకర్,సంతోష్, మహేష్ బాబు,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సర్పంచ్‌ల ఫోరమ్ ప్రధాన కార్యదర్శిగా పరశురామ్

వేములవాడ / ప్రజాదివాస్ జూలై 27
రాజన్న సిరిసిల్ల జిల్లా సర్పంచ్‌ల ఫోరమ్ ప్రధాన కార్యదర్శిగా సంకెపల్లి సర్పంచ్ రెడ్డవేణి పరశురామ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు అన్నబోయిన తిరుపతి (ఏటీ యాదవ్) ఆధ్వర్యంలో ఆయనను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పరశురామ్‌కు పలువురు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్ర అభివృద్ధి, హక్కుల పరిరక్షణ కోసం సమర్థవంతంగా పనిచేస్తానని ఈ సందర్భంగా పరశురామ్ పేర్కొన్నారు.



# కాంపిటేషన్ ఎగ్జామ్ లో స్టేట్ టాపర్ "సుంచు ఇందు"

**- విద్యార్థిని అభినందించిన అధ్యాపక బృందం**




ముస్తాబాద్/ జులై 27 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా చిన్న బోనాల గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థి సుంచు ఇందు కాంపిటేషిన్ ఎగ్జామ్ లో స్టేట్ టాపర్ గా నిలిచారు. చిన్న బోనాల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు రూపాయలు ఏడువందల నగదు బహుమతి అందించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల చేత ప్రతి ఎగ్జామ్స్ లో పాల్గొంటే వారి మేథస్సు పెరుగుతుందని అన్నారు. దీనికి తల్లిదండ్రుల కృషి కూడా ఉండాలని, పిల్లలను చిన్నప్పటి నుండే పట్టుదలతో చదివిస్తే ఉన్నంత శిఖరాలకు వెళతారని విద్యార్థులు పోటీ పరీక్షలు రాసినప్పుడే విద్యార్థుల్లో విజ్ఞానం మెరుగుపడుతుందని వారన్నారు

# ప్రజావాణికి 162 దరఖాస్తుల రాక

**- అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

రాజన్న సిరిసిల్ల, జూలై 27ప్రజా దివస్



ప్రజావాణికి 162 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 162 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందించి.. పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.ఆర్డీఓ కార్యాలయాల్లో..సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 7 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

అలాగే వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 1 దరఖాస్తు రాగా, సంబంధిత శాఖ అధికారికి పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా కన్వీనర్ గా కొల్లూరు శంకరయ్య నియామకం

సిరిసిల్ల/ జులై 27 ప్రజా దివాస్



తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కట్కూరి మల్లేశం రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న రాష్ట్ర ఉపాధ్యక్షులు సుంచు బాబు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ బలోపేతంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లా కన్వీనర్ గా కొల్లూరు శంకరయ్య ను నియమించినట్లు రాష్ట్ర కమిటీ తెలపడం జరిగింది రాజన్న సిరిసిల్ల జిల్లాలో త్వరలో ఎస్సీ ఎస్టీ జిల్లా మహాసభ నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని అలాగే ఎస్సీ ఎస్టీ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ పనిచేస్తుందని జిల్లాలోని ఎస్సీ ఎస్టీ జర్నలిస్టులందరూ అంకితభావంతో పనిచేసి తమ హక్కులను సాధించుకుందామని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది

# స్తంభంపల్లిలో చెడిపోయిన బోర్లకు మరమ్మతులు

**- తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు: సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్**
**- స్తంభంపల్లి గ్రామ పంచాయతీ, పాల కేంద్రం వద్ద నూతన హ్యాండ్ బోర్లు ఏర్పాటు**

బోయినిపల్లి మండలం /ప్రజాదివాస్ జూలై 27

బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా నిరుపయోగంగా ఉన్న బోరుబావులకు సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ మరమ్మతులు చేయించారు. గ్రామంలోని పాల కేంద్రం వద్ద ఉన్న సింగిల్ ఫేస్ కరెంట్ మోటార్ బోరుబావి చెడిపోయి చాలాకాలంగా మూలన పడింది. మనుషుల సహాయంతో లోపల ఉన్న మోటార్ పంపు పైకి



రాకపోవడంతో, ప్రత్యేకంగా ట్రాక్టర్ యంత్రాన్ని తెప్పించి లోపలి నుండి మోటారును బయటకు తీశారు. అనంతరం అక్కడ ప్రజల నీటి అవసరాల కోసం కొత్త హ్యాండ్ బోర్ పంపును బిగించారు. అలాగే గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కూడా ఉపయోగంలో లేని బోరుబావికి నూతనంగా హ్యాండ్ బోర్ పంపును అమర్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు నీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే వెంటనే స్పందించి నిరుపయోగంగా ఉన్న బోర్లకు మరమ్మతులు చేయించి కొత్త హ్యాండ్ బోర్లను బిగించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన ముందస్తు చర్యలు చేపడతామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఆయన పేర్కొన్నారు. నీటి ఎద్దడి పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ధాన్యం కుంభకోణం కలకలంలో నిందితుడి ఇంట రైతుల ఆందోళన...

**- ఖాతాల్లో జమ కాని డబ్బులు..భవనం పైకి ఎక్కి నిరసన తెలిపిన అన్నదాతలు..**
**- మత్రిపల్లి, నూకలమర్రి, మల్లారం కేంద్రాల రైతుల ఆవేదన..**
**- రంగంలోకి దిగిన పోలీసులు..**

వేములవాడ /ప్రజాదివాస్ జూలై 27

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధాన్యం కుంభకోణం కలకలం సృష్టించింది. ఈ కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వేములవాడకు చెందిన మధుకర్ నివాసం వద్ద రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని మార్కండేయ నగర్ లో నిర్మాణంలో ఉన్న మధుకర్ ఇంటి రెండవ అంతస్తు పైకి ఎక్కి సుమారు 20 మంది రైతులు ఆందోళనకు దిగారు. మత్రిపల్లి, నూకలమర్రి, మల్లారం కొనుగోలు కేంద్రాల ద్వారా తాము విక్రయించిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు నేటి వరకు తమ బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, డీసీవోలు వెంటనే సంఘటనా స్థలానికి వచ్చి తమ సమస్యను పరిష్కరించాలని వారు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ ఆందోళన సమాచారం అందుకున్న సీఐ వీరప్రసాద్ తమ పోలీస్ సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రైతులను శాంతింపజేసేందుకు మరియు పరిస్థితిని



అదుపులోకి తెచ్చేందుకు అధికారులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

# విద్యార్థినికి సైకిల్ బహూకరించి ఉదారత చాటుకున్న ఉపాధ్యాయుడు

**- నడిచి వస్తున్న విద్యార్థిని ఇబ్బంది గుర్తించి సైకిల్ అందజేత**
**- ఉపాధ్యాయుడి సేవలు అభినందనీయం: సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్**

బోయినిపల్లి మండలం/ ప్రజాదివాస్ జూలై 27

బోయినిపల్లి మండలం స్తంభంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న గుండేటి చంద్రమౌళి (ఎస్ఏ) తన ఉదారతను చాటుకున్నారు. పక్క గ్రామమైన గుండన్నపల్లి నుండి రోజువారీగా రెండు కిలోమీటర్లు నడిచి పాఠశాలకు వస్తున్న ఆరో తరగతి విద్యార్థిని గుంట అనుశ్రీ ఇబ్బందులను



గమనించిన ఆయన, ఆ విద్యార్థినికి సొంత ఖర్చులతో కొత్త సైకిల్ను కొనిచ్చారు. ఈ సందర్భంగా స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యాబుద్ధులు నేర్పడమే కాకుండా విద్యార్థుల స్థితిగతులు, బాగోగులను గుర్తించి ఆదుకోవడం గొప్ప విషయమని, ఉపాధ్యాయుడు చంద్రమౌళిని అభినందించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అవసరాలకు తమ పాలకవర్గం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. గ్రామాభివృద్ధి, పాఠశాల తరపున ఉపాధ్యాయుడికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చంద్రగిరి వెంకటేష్, గంగాధర గంగాజమున, చిలుముల శ్రీమణి, కొట్టపల్లి రమ్యశ్రీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు సరైన న్యాయం చేయకపోతే మళ్లీ ఉద్యమమే

**- ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్న ఉద్యమకారులు**
**- ఉద్యమకారులకు సరైన న్యాయం చేయాలి**
**- సంగెం మండలంలో అధ్యక్షులు కౌడగాని శంకర్రావు**

జులై 27 ప్రజా దివాస్

టి యు ఎఫ్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశానుసారం సంగెం మండలంలో అధ్యక్షులు కౌడగాని శంకర్రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీలలో ఉద్యమకారులను గుర్తించినందుకు అలాగే కేకే కమిటీ ఏర్పాటు చేసినందుకు ఉద్యమకారుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము ఈనెల 10 తేదీ ఏడో నెల 2026 నుండి 24 7 2026 వరకు తెలంగాణ అమర జ్యోతి ప్రాంగణంలో హైదరాబాద్ నందు ప్రభుత్వం ప్రకటించిన కేకే కమిటీ అధ్యక్షులు కే కేశవరావు ఆధ్వర్యంలో ఉద్యమ సంఘం సూచనలు సలహాలు తీసుకొని డిసెంబర్ 2026 చివరి వరకు తగిన నిర్ణయం తీసుకుంటామని ప్రకటించిన కమిటీ కాలయాపన కమిటీగా భావిస్తూ గత తొమ్మిది సంవత్సరాల నుండి డాక్టర్ చీమ సీను ఆధ్వర్యంలో ఉద్యమకారుల సమస్యలపై పోరాటాలు చేస్తున్న వారు కాలయాపన చేయడానికి ఖండిస్తూ 15 ఆగస్టు వరకు తగిన నిర్ణయం తీసుకొని ఉద్యమకారులకు న్యాయం చేయాలని చేయని యెడల మరో ఉద్యమానికి వెనుకాడమని న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని మాట్లాడినారు ఉద్యమ రథసారథి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షులు పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని భావిస్తున్నాము ఈ కార్యక్రమంలో టియుఎఫ్ సంఘం మండల అధ్యక్షులు కౌడగాని శంకర్రావు టిఎఫ్ జిల్లా



కమిటీ కార్యదర్శి రాచమల్ల కోదండ రాములు టి యు ఎఫ్ మండల మహిళా అధ్యక్షురాలు తాటికొండ ఉమామహేశ్వరి మండల ఉపాధ్యక్షులు ట టి యు ఎఫ్ ఎండి మహబూబ్ పాషా ఉపాధ్యక్షులు పశ్చిమట్ల రమేష్ ఉపాధ్యక్షులు తోట లక్ష్మీనారాయణ కార్యదర్శి గుండేటి కోర్నేలు బానోతు దేవ సింగ్ నాశం ఎల్లయ్య సదిరం కొమ్మాలు గోశాల ప్రభాకర్ గుండేటి రామస్వామి మెట్టుపల్లి యాకయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఖాళీ ప్రదేశాల్లో చెత్త, మారని కొందరి తీరు

ప్రజాదివాస్



బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయకూడదని సర్పంచ్, కార్యదర్శి, పాలక వర్గ సభ్యులు మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రజలకు పలుమార్లు స్పష్టంగా చెప్పినప్పటికీ ఆదేశాలను కొందరు బేఖాతరు చేస్తూ రోడ్లపై, కాలువలలో, ఖాళీ స్థలాలలో బాధ్యతారాహిత్యంగా వేసే వ్యర్థాలు వలన దమ్మపేట మండల కేంద్రంలో ఎక్కడ చూసిన చెత్త దర్శనం ఇస్తుంది. చెత్తను పంచాయతీ ట్రాక్టర్ లోనే వేయాలి అని మైక్ ద్వారా ప్రచారం చేసినప్పటికీ, చెత్త వేసే ప్రదేశాలను శుభ్రం చేసి ఫ్లెక్సీలు కట్టించి చెత్త వేస్తే నిబంధనల ప్రకారం రూ. 500 జరిమానా అని తెలియజేసినప్పటికీ, చెత్త కోసం తడి, పొడి చెత్త బుట్టల పంపిణీ చేసినప్పటికీ కొందరు ముఖ్యంగా ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయడం వలన పరిసరాలు కలుషితమై, దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా, చెత్త కుళ్ళి దుర్వాసన ప్రజల ఆరోగ్యం దెబ్బతినకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా చెత్తను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలిస్తూ బ్లీచింగ్ చల్లించే ఏర్పాట్లు చేయిస్తున్న సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు. సోమవారం మల్లారం రోడ్డులో ఖాళీ ప్రదేశంలో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే పనులను పర్యవేక్షించి చుట్టుపక్కల ప్రజలకు చెత్త వేయకుండా అవగాహన కల్పించారు.

# హామీలు అమలు చేయక పోతే ఉద్యమం ఉధృతం,,!

**- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హెచ్చరిక,,,**

**- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ పిలుపు,,,**

ప్రజాదివాస్



మేరకు, తాడ్వాయి మండలకేంద్రంలో ఫోరం ఆధ్వర్యంలో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి లిజిల్లా నాయకులు పత్తి గోపాల్ రెడ్డి,బండారి చంద్రయ్య లు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేకే కమిటీ ద్వారా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ఆగస్టు 15వ తేదీలోపు వెంటనే అమలు చేయాలని డిమాం డ్ చేశారు. కాలయాపన చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.స్వరాష్ట్రం కోసం మేము వంటావార్పు, రాస్తారోకో, బంద్ లాంటి ఉద్యమాలతో పోరాడాం. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే అదే స్థాయిలో మళ్లీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం” అని గోవింద నాయక్ ప్రభుత్వా న్ని హెచ్చరించారు.ఉద్యమకారుల సంక్షేమం, గుర్తింపు విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన కోరారు.సమావేశంలో పాల్గొన్నవారు సల్లూరి లక్ష్మణ్ , ఊకే రామయ్య, భూపతి జనార్ధన్ , ఇర్ప జగన్, చౌగాని చిరంజీవి తదితరులున్నారు

# లంక సాగర్ పీహెచ్సీలో ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలి ఐద్వ రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి

ప్రజాదివాస్



పెనుబల్లి మండలంలోని లంక సాగర్ గ్రామంలో ఉన్న పీహెచ్సీ హాస్పటల్లో సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి ఐద్వా డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి తదితరులు మాట్లాడుతూ పెనుబల్లి మండలంలో చుట్టుపక్కల గ్రామాలు 10 గ్రామాలకు మంచి వైద్యం అందిస్తున్న ప్రభుత్వ పీహెచ్సీలో ల్యాబ్ టెక్నీషియన్ స్టాఫ్ నర్స్ ఫార్మసిస్ట్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు హాస్పటల్లో రోగులు ఎక్కువగా వస్తున్నందున వారికి తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు అట్లనే హాస్పిటల్ కి సంబంధించి మీటింగ్ హాల్ ఏర్పాటు చేయాలని స్టోర్ రూమ్స్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు పీహెచ్సీలో మంచి వైద్యం అందిస్తున్న గాని ప్రభుత్వం నిర్లక్ష్యంతో పోస్టులు భర్తీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని వారు విమర్శించారు ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణి డివైఎఫ్ఐ జిల్లా నాయకులు భూక్య ప్రసాద్ రైతు సంఘం మండల అధ్యక్షుడు చిట్టి మొదల కృష్ణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గాయం తిరుపతిరావు ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కంద సత్యం తదితరులు పాల్గొన్నారు

# కొత్తగూడెం నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతాం

**- సుజాతనగర్ మండల సమగ్ర అభివృద్ధికి నిరంతర కృషి**

**- ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పిస్తున్నాం**

**- పార్టీలకతీతంగా పెదవర్గాలకు సంక్షేమ ఫలాలు**

**- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు**

**- రూ.1.95కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన**

ప్రజాదివాస్

సుజాతనగర్ : కార్పొరేషన్ పరిధిలోని గ్రామాల రూపురేఖలు మార్చేలా సమగ్ర అభివృద్ధి పనులు చేపడుతున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. సుజాతనగర్ మండల పరిధిలోని కార్పొరేషన్ డివిజన్లో రూ.1.95 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు, బస్ షెల్టర్ల నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుజాతనగర్ కార్పొరేషన్ ప్రాంతంగా మారిన తర్వాత మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించామని చెప్పారు. ప్రతీ గ్రామంలో తాగునీరు, వీధిదీపాలు, డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, సుజాతనగర్ నుండి శివాలయం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు అందుబాటులోకి తెచ్చామన్నారు. సుజాతనగర్లో మున్సిపల్ సబ్ డివిజన్ కార్యాలయ ఏర్పాటుతో పాటు, సింగభూపాలెం చెరువుకట్ట అభివృద్ధి కోసం రూ.5.5 కోట్లు మంజూరు కానున్నట్లు వెల్లడించారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ (న్యాక్) కేంద్రం మంజూరైందని,అదేవిధంగానియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రగతికి అవసరమైన నిధుల కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనులు వేగవంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా



కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సొసైటీ అధ్యక్షులు మండే హనుమంతరావు, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, మున్సిపల్ కమిషనర్ సుజాత, కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీఓ భారతి, ఏఓ నర్మద, విద్యుత్ శాఖ ఏఈ కిషన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్య దస్రు, మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు, నాయకులు జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు తాళ్ల వెంకటేశ్వర్లు, తాళ్లూరి పాపారావు మండల నాయకులు వీర్ల మల్లేష్, దుర్గాప్రసాద్, బొడ్డు కేశవరావు, కొమారి కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్నేహా బంధం... మానవత్వం

**- తోటి కానిస్టేబుల్ కుటుంబానికి 1.49 లక్షల సాయం**

**- తోటి మిత్రుడికి తోడుగా: ‘2007 బ్యాచ్’ పోలీసుల ఉదారత!**

**- ఆపదలో ఆదుకున్న స్నేహం: దివంగత కానిస్టేబుల్ కుటుంబానికి పోలీసుల బాసట**

ప్రజాదివాస్



విధి నిర్వహణలోనే కాకుండా తోటి ఉద్యోగి కష్టంలోనూ తామున్నామంటూ 2007 విడత (బ్యాచ్) ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) పోలీసు సిబ్బంది తమ ఉదారతను చాటుకున్నారు. టేకులపల్లి మండలం, కుంటల గ్రామానికి చెందిన తొలం నాగేశ్వరరావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిల్లా ఏఆర్ కానిస్టేబుల్‌గా సేవలందిస్తూ, నెల రోజుల క్రితం తీవ్ర అనారోగ్య సమస్యలతో అకస్మాత్తుగా కన్నుమూశారు.ఈ విషాద వార్త తెలుసుకున్న ఆయన సహచరులు, 2007 విడతకు చెందిన తోటి కానిస్టేబుళ్లు వెంటనే స్పందించారు. నాగేశ్వరరావు కుటుంబానికి బాసటగా నిలవాలనే సంకల్పంతో తమ విడత సభ్యులందరి నుండి విరాళాలు సేకరించి, 1,49,000/- (లక్షా నలభై తొమ్మిది వేల రూపాయల) ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు నేరుగా అందజేశారు.ఈ సందర్భంగా తోటి మిత్రులు మాట్లాడుతూ... “నాగేశ్వరరావు కర్తవ్య నిష్ట కలిగిన పోలీసు అధికారి మాత్రమే కాకుండా మంచి మనసున్న వ్యక్తి. ఆయన అకాల మరణం మా అందరికీ తీరని లోటు. ఎంత డబ్బు ఇచ్చినప్పటికీ ఆయన లోటును పూర్చలేము, కానీ వారి కుటుంబానికి మేమున్నామనే ధైర్యాన్ని ఇవ్వడానికే ఈ చిన్న సహాయం చేశాం” అని భావోద్వేగంతో తెలిపారు.ఆపదలో ఉన్న మిత్రుని కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చిన 2007 విడత మిత్రుల మానవతా దృక్పథాన్ని, బాధ్యతాయుతమైన ప్రవర్తనను జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్థానికులు విశేషంగా కొనియాడారు.ఈ కార్యక్రమంలో 2007 విడత మిత్రులు ఎం. చంద్రశేఖర్, శామ్, లక్ష్మణ్ స్వామి, వెంకటేశ్వర్లు, రామారావు, రమేష్, గోపాల్, శేఖర్ లతో పాటు సూర్యాపేట జిల్లా నుండి ప్రత్యేకంగా వచ్చిన కే. నాగరాజు, టీ. మధు మోహన్ ఇతర తోటి సిబ్బంది పాల్గొన్నారు.

# అన్ని బొద్దింకల కంటే పెద్ద బొద్దింక రాహుల్ గాంధీ యువమోర్చా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గొటిక శివకృష్ణారెడ్డి

ప్రజాదివాస్

నీట్ పేపర్ లీక్ అంశం వ్యవహారంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఉద్యమం మరియు రాజీనామా అభ్యర్థనతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పట్ల విచారం వ్యక్తం చేసిన శివకృష్ణారెడ్డి నీటి పరీక్షలో అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని పరీక్షను రద్దు చేయడంతో పాటు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుందన్నారు నిజమైన పరీక్ష బాధితుల పట్ల బిజెపికి పూర్తి సానుభూతి ఉందని అయితే ఈ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే కాంగ్రెస్ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు అలాగే ప్రజాస్వామ్య వ్యవస్థలను లక్ష్యంగా చేసుకునే ఏ ప్రయత్నాన్నైనా బిజెపి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని కాంగ్రెస్ ఆప్ లు సీజేపీ వెనుకనుండి ప్రోత్సాహించి దొంగ నిరసనలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ యువతను రెచ్చగొడుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన హింసాత్మక ధర్నాను తీవ్రంగా ఖండిస్తూ చేస్తున్న ఆందోళనలు చాలా బాధాకరం మరియు ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చేలా ఉన్నాయన్నారు నీట్ ను అడ్డుపెట్టుకొని కమ్యూనిస్టులు దేశ వ్యతిరేక శక్తులు దేశాన్ని విడగొట్టాలని కుట్రలు చేస్తున్నారు ఆర్టికల్ 370 ని మళ్లీ తీసుకురావాలని ఆర్ఎస్ఎస్ ను బ్యాన్ చేయాలని మాట్లాడుతున్నారు అసలు సనాతన ధర్మానికి ఆర్ఎస్ఎస్ కు మరియు నీట్ పరీక్షలకు సంబంధం ఏంటని ప్రశ్నించారు కాంగ్రెస్ హయాంలో 150కి పైగా పేపర్ లీకులు జరిగాయి ఈ అంశాలన్నింటిపై ప్రధాని మోదీ ధైర్యంగా పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉంటే వాళ్లకు మాత్రం నిజాలు మాట్లాడే ధైర్యం లేదని ఎద్దేవా చేశారు గత 10 రోజుల వరుస ఘటనలు తనను బాధించాయని యువశక్తే ఈ దేశ అసలైన శక్తి అని యువత భవిష్యత్తు కోసం విస్తృత సామాజిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాజీనామా చేయాల్సి వచ్చిందని ధర్మేంద్ర ప్రధాన్ అనడం దేశ యువత పట్ల తనకున్న అంకితభావం తెలియజేస్తుంది కేంద్ర విద్యాశాఖ మంత్రిగా జాతీయ విద్యా విధానం-2020 అమలు విద్యా రంగంలో 100కు పైగా పెద్ద మరియు చిన్న సంస్కరణలను తీసుకువచ్చారని భారత విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి భవిష్యత్తుకు



సిద్ధం చేయడానికి ఆయన పదవీకాలం నిజమైన అంకితభావాన్ని ప్రదర్శించింది విద్యార్థులు మరియు విద్య పట్ల ఆయనకున్న అంకితభావానికి దేశ నిర్మాణంలో ధర్మేంద్ర ప్రధాన్ పాత్రకు ధన్యవాదాలు తెలిపారు చిల్లర రాజకీయాలను తిప్పికొట్టి ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు బాధ్యతాయుతమైన యువత దేశ పౌరులంతా ఐక్యంగా ఉండి అప్రమత్తంగా వ్యవహరించాలిని గొటిక శివకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు

# జర్నలిస్టుల సంక్షేమమే టీజేఎంయూ లక్ష్యం రాష్ట్ర అధ్యక్షులు ఐ ప్రభాకర్

**– అశ్వారావుపేట నియోజకవర్గ సమావేశాన్ని ఆగస్టు 15 లోపు నిర్వహించాలని ఆదేశం**

ప్రజాదివాస్
ఖమ్మంలోని టీజేఎంయూ యూనియన్ కార్యాలయంలో తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ (టీజేఎంయూ) ఫౌండర్, రాష్ట్ర అధ్యక్షులు ఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జనరల్ బాడీ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఐ ప్రభాకర్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గ కమిటీల సమావేశాలను త్వరితగతిన నిర్వహించాలని, ఆయా సమావేశాల్లో నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు పదవీ బాధ్యతలను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం టీజేఎంయూను ఏర్పాటు చేశామని, ఈ యూనియన్ ఎన్‌యూజే (ఐ) అనుబంధంగా పనిచేస్తోందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సమిష్టిగా పనిచేసి జిల్లా వ్యాప్తంగా యూనియన్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, వారి హక్కులు, సంక్షేమ పథకాలపై ప్రత్యేక అవగాహన సదస్సులను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సామల ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదయ్ రాఘవ, జిల్లా కోశాధికారి ఎం.ఎం. కుమార్, అశ్వారావుపేట అధ్యక్షులు నూనె హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆగస్టు 15 లోపు అశ్వారావుపేట నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని రాష్ట్ర అధ్యక్షులు ఐ ప్రభాకర్ ఆదేశించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదయ్ రాఘవ, అశ్వారావుపేట అధ్యక్షులు నూనె హనుమంతరావు అధ్యక్షతన ఈ సమావేశాన్ని




నిర్వహించి, నూతన సభ్యత్వ నమోదు, పదవీ బాధ్యతల అప్పగింత కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. అశ్వారావుపేట డివిజన్, మండల స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులు, రిపోర్టర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని టీజేఎంయూ సభ్యత్వాన్ని పొందడంతో పాటు, జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం నిర్వహించే అవగాహన సదస్సులో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.
15

# డి.ఏ.పీ. ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి డా. బోగ శ్రావణి

**డి.ఏ.పీ. ఎరువుల అక్రమ విక్రయాలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన బీజేపీ నాయకురాలు డా. బోగ శ్రావణి**

ప్రజాదివాస్
జగిత్యాల జిల్లాలో రైతులకు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు డి.ఏ.పీ. ఎరువులు విక్రయిస్తున్న డీలర్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ జగిత్యాల నియోజకవర్గం ఇన్చార్జ్ డా"బోగ శ్రావణి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా డా. బోగ శ్రావణి మాట్లాడుతూ, డి.ఏ.పీ. ఎరువుల ఎమ్మార్పీ ధర 1,350 మాత్రమే ఉన్నప్పటికీ, కొంతమంది డీలర్లు ఒక్కో బస్తాను 1,950 వరకు విక్రయిస్తూ రైతుల నుండి అదనంగా 600 వసూలు చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయ సీజన్‌లో ఎరువులపై రైతులకు ఉన్న అత్యవసర అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని అన్నారు.అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి






కారణంగా రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే ఎరువులు రైతులకు అందేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.అలాగే, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు డి.ఏ.పీ. ఎరువులు విక్రయిస్తున్న డీలర్లు, షాపు యజమానులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. రైతుల ప్రయోజనాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ వారి పక్షాన నిలుస్తుందని డా. బోగ శ్రావణి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బద్దం తిరుపతి రెడ్డి,జిల్లా కార్యదర్శిలు ముత్యం రెడ్డి,పాత రమేష్,జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత,జిల్లా యువ మోర్చా అధ్యక్షురాలు ఇత్తడి శేఖర్, ఎస్ సి మోర్చా జిల్లా అధ్యక్షులు నారపక అశోక్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, మరియు జిల్లా, మండల పదాధికారులు ముఖ్యనాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు చేయించిన: ఎస్సై ఉదయ్ కుమార్

ప్రజాదివాస్
జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీఎస్పీ కె. పురుషోత్తంరెడ్డి సూచనలతో, ధర్మపురి సీఐ ఎ. రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో, జగిత్యాల జిల్లా వెల్గటూర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి. ఉదయ్ కుమార్ సోమవారం నేర నియంత్రణలో భాగంగా వెల్గటూర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో "నేను సైతం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వెల్గటూర్ గ్రామంలోని బాలాజీ కిరాణా స్టోర్ యజమానుల సహకారంతో, వారి దుకాణం ఎదుట రహదారి స్పష్టంగా కనిపించే విధంగా రెండు నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు ఈ సందర్భంగా ఎస్ఐ పి. ఉదయ్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలో నేరాల నియంత్రణకు పోలీసు శాఖతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత కీలకమని తెలిపారు. ప్రతి వ్యాపార సంస్థ, వాణిజ్య సముదాయం మరియు దుకాణ యజమానులు తమ దుకాణాల ఎదుట రహదారులు స్పష్టంగా కనిపించేలా నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.సీసీ



కెమెరాల ఏర్పాటు వల్ల అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడమే కాకుండా, నేరాలు జరిగిన సందర్భాల్లో నిందితులను త్వరితగతిన గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఎంతో దోహదపడుతుందని వివరించారు.పోలీసు శాఖ చేపడుతున్న "నేను సైతం" కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా సహకరించి తమ ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థలు మరియు పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నేర రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు బాలాజీ కిరాణం యజమాని ప్రసాద్ గ్రామస్తులు పాల్గొన్నారు

## నందిగామలో బీజేవైఎం ఎన్టీఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ సదస్సు




ప్రజాదివాస్
ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో భారత సాయుధ దళాల వీరత్వాన్ని మరియు వారి అత్యున్నత త్యాగాలను స్మరించుకుంటూ బీజేవైఎం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గొటిక శివకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో నందిగామలోని చైతన్య ఏసీ క్యాంపస్ లో జూలై 26 కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఒక సదస్సు నిర్వహించారు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించిన శివకృష్ణ రెడ్డి 1999 కార్గిల్ యుద్ధం యొక్క ప్రాముఖ్యతను వివరించారు ఈ యుద్ధంలో భారత సైన్యం పాకిస్థాన్ చొరబాటుదారులను సమర్థవంతంగా తిప్పికొట్టి దేశ ప్రాదేశిక సమగ్రతను కాపాడింది సంఘర్షణ సమయంలో భారత సాయుధ దళాలు ప్రదర్శించిన ధైర్యం దేశభక్తి మరియు దృఢ సంకల్పం గురించి ఆయన మాట్లాడారు అలాగే విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించిన 527 మంది వీర జవాన్లకు ఆయన ఘన నివాళులర్పించారు దేశభక్తి ఐక్యత క్రమశిక్షణ మరియు నిస్వార్థ సేవా భావాలను అలవర్చుకోవాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు కార్గిల్ వీరుల త్యాగాలు ప్రస్తుత మరియు భావి తరాలకు అంకితభావంతో దేశానికి సేవ చేసేలా స్ఫూర్తినిస్తూనే ఉండాలని ఆయన పేర్కొన్నారు బీజేవైఎం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ అమరనేని కార్తీక్ అభినందించారు భారత సైనికుల ధైర్యం మరియు అంకితభావం నుండి స్ఫూర్తి పొందాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు
ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సాయి విష్ణు తో పాటు పార్టీ నాయకులు సీతారామయ్య కామేశ్వరరావు కేదార్‌నాథ్ శర్మ సాంబశివరావు సుందరరావు మరియు ఇతర పార్టీ నాయకులు విద్యార్థులు అధ్యాపకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## వెల్గటూర్ మండలంలో విత్తన మేళా నిర్వహణ

ప్రజాదివాస్
జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల రైతు వేదికలో సోమవారం మండల వ్యవసాయ అధికారి పెండ్యాల సాయికిరణ్ ఆధ్వర్యంలో విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు



కంది, పెసర, మొక్కజొన్న, వివిధ రకాల కూరగాయల విత్తనాలను అందుబాటులో ఉంచడంతో పాటు, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రాముఖ్యత, నాణ్యమైన ధృవీకరించిన విత్తనాల వినియోగం వల్ల అధిక దిగుబడులు సాధించే అవకాశాలపై అవగాహన కల్పించారు. రైతులు ప్రస్తుత పరిస్థితిలో ఆరుతడి పంటలు పండించవలసిందిగా కోరడమైనది. వరి విస్తీర్ణం తగ్గించి మిగితా పంటల పై రైతులు ద్రుష్టి పెట్టాలని కోరారు ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ రత్నాకర్, కప్పారావు పేట సర్పంచ్ పోచయ్య, రాజక్క పల్లి సర్పంచ్ దొరిశెట్టి.మల్లేశం, మండల ఉపసర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షుడు గంధ్ర ప్రతాప్ రావ్, వ్యవసాయ విస్తరణ అధికారులు రవళి, ఫిర్దోస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రవీణ్, వెల్గటూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ సందీప్ రెడ్డి, వెల్గటూర్ మండల విత్తన డీలర్స్ మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ప్రజాదివాస్
జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైన గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విగ్రహ దాత మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతూదేశానికి అంబేద్కర్ అందించిన సేవలు, రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలనే ఆయన ఆశయాలు అమూల్యమైనవని స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల స్థానిక ప్రజాప్రతినిధులు, అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు, గ్రామ ముఖ్య బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కలెక్టర్ ని కలిసిన సిపిఎం పార్టీ బృందం

- డబల్ బెడ్ రూమ్ లో సమస్యల పైన



ప్రజాదివాస్

బూర్గంపాడు మండలం టేకులచెరువు గ్రామానికి చెందిన 40 కుటుంబాలకు డబుల్ బెడ్ రూములు గత ఐదు సంవత్సరాల నుండి పెండింగ్లో ఉండటం వల్ల కలెక్టర్ ని కలిసి వినతిపత్రం కలెక్టర్ కు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అందజేశారు వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నిర్మాణం జరిగిందని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత టేకులచెరువు గ్రామానికి చెందిన 40 కుటుంబాలకి అధికారికంగా ప్రకటించి ఇంత మట్టికి ఇవ్వకపోవడం వల్ల కలెక్టర్ దృష్టికి తీసుకురావటం జరిగింది వెంటనే కలెక్టర్ స్పందించి హౌసింగ్ బోర్డు అధికారులకు నెల రోజులలో డబ్బులు బెడ్ రూములు నిర్మాణాన్ని పూర్తి చేసి 40 కుటుంబాలకి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు వారికి డబల్ బెడ్ రూమ్ కుటుంబాలు హర్షం వ్యక్తం చేశారు నెల రోజుల్లో ఇవ్వలేకపోతే అధికారికంగా ప్రకటించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వారికి కేటాయించాల్సిన అవసరం ఉందని అని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పాండవుల రామనాథం, శాఖ కార్యదర్శి బోల్ల శ్రీశైలం, ఎంఎల్ పార్టీ నాయకుడు జక్కుల రాంబాబు, సంపత్,

## ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్, ఖమ్మం వారు నిర్వహించిన తనిఖీలలో మణుగూరులో ద్విచక్ర వాహనంలో (04.760) కేజీల గంజాయి పట్టివేత

ప్రజాదివాస్



ది.27-07-2026 తేదీన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమి రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్ . కిషన్ ల ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్ ఐ. సి హెచ్.శ్రీ హరి రావు మరియు సిబ్బంది కలిసి అశ్వపురం (మ), గొల్లగూడెం (వి) వద్ద గల సీతారామ కెనాల్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వచ్చుచున్న వాహనాలను ఆపి తనిఖీ చేయగా వాహనం హీరో గ్లామర్ (టిఎస్ 24 ఇ 6802)ని ఆపి తనిఖీ చేయగా దానిలో 04.760 కేజీల ఎండు గంజాయి లభ్యమైంది. ఇట్టి గంజాయిని ఇ1) జాల సందీప్, తా/శీ. లక్ష్మయ్య, =/శీ. హనుమాన్ నగర్, నల్గొండ జిల్లా మరియు ఒక మైనర్, కలిమెల నుండి హైద్రాబాద్ కు తరలిస్తూ పట్టుబడినారు. ఇట్టి వాహనంలో లభ్యమైన మొత్తం 04.760 కేజీల ఎండు గంజాయిని, ద్విచక్ర వాహనమును మరియు సెల్ ఫోనును (వీటి మొత్తం విలువ రూ. 2,96,000) లను తదుపరి విచారణ నిమిత్తం మణుగూరు ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించడమైనది..ఇట్టి తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్ కానిస్టేబుల్స్ వీరబాబు, ప్రసన్నకుమార్, తిరుపతి, ఉపేందర్ లు పాల్గొన్నారు. నోట్: ఏదైనా గంజాయి మరియు మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఉన్నచో టోల్ ఫ్రీ నెంబర్ 18004252523 కు సమాచారం అందించగలరని మీ వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్ఐ తెలియజేశారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న నాయకులను పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ప్రజాదివాస్



జగిత్యాల జిల్లా బుగ్గారం మండల మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఎండీ అబ్దుల్ రహమాన్ తండ్రి జలీల్ రహమాన్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వారి నివాసానికి వెళ్ళి పరామర్శించారు.జలీల్ రహమాన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం, అనారోగ్యంతో బాధపడుతున్న నాయకులు ఎండీ అహ్మద్ ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించి ధైర్యం గా ఉండాలని తెలియజేశారు .ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల తో పాటు స్థానిక మరియు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్ టీ సి కార్మికులను తక్షణమే ప్రభుత్వంలో విలీనం చేయాలి..ఆర్వినేని.కృష్ణ

ప్రజాదివాస్

27/07/2026 న ఖమ్మం రీజియన్ తెలంగాణ మజ్దూర్ యూనియన్ భద్రాచలం డిపో వారి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఆదివాసి గిరిజన భవనం కార్యాలయం లో జరిగింది. ఖమ్మం రీజియన్ కార్యదర్శి కృష్ణ గారు ప్రసంగిస్తూ ఆర్టీసీ నీ తక్షణమే ప్రభుత్వం లో విలీనం చేయాలని, సంపూర్ణ ఉద్యోగ భద్రత తో కూడిన విలీనం జరగాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి జున్ను రవి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ ఆర్టీసీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ఆర్టీసీ నీ తక్షణమే ప్రభుత్వం లో విలీనం చేయాలని,ఆర్టీసీ లో సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని రిటైర్మెంట్ అయిన కార్మికుల బకాయిలులను తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో మరోఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశం లో రాష్ట్ర కార్యదర్శి కె. వి. ఎస్ రెడ్డి మాట్లాడుతూ కొన్ని సంఘాలు విమర్శలు,ప్రచారం తో కాలయాపన చేస్తున్నారు.తప్ప కార్మిక వర్గంకోసం కాదు అని అధికారదాహంతో ఆరాటపడుతున్నారు అని ఎద్దేవాచేశారు. రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. కవిత మాట్లాడుతూ కార్మికులపై జరుగుతున్న దాడులుపై ప్రభుత్వం,యాజమాన్యం తక్షణమే స్పందించాలి అని డిమాండ్ చేశారు. భద్రాచలంలో డిపో పరిధిలో పనిచేయు యావన్మంది కార్మికులు ఈ యూ ,సీఐటీయూ , ఐ ఎన్ టి యు సి సంఘాల యూనియన్స్ లలో ఎన్నోయేళ్లుగా కొనసాగిన కార్మికులు టీ ఎం యూ సంఘంలో జాయిన్ అయ్యారు.వీరికి పూలమాలలతో స్వాగతం పలికారు యూనియన్ నేతలు.తదనంతరం టీ ఎం యూ బిసిఎం డిపో నూతన కమిటినీ అధ్యక్షలుగా వెంకన్న బాబు,కార్యదర్శిగా జి .యుగంధర్,వర్కింగ్ ప్రెసిడెంట్ గా సాంబ, గ్యారేజ్ ప్రెసిడెంట్ సుభాని,భేగ్ కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ సమావేశం లో రీజినల్ కార్యదర్శి ఏ.కృష్ణ,ఆర్ .ఆర్ .కె , రాష్ట్ర కార్యదర్శులు కె. వి. ఎస్ . రెడ్డి,జున్ను.రవి,జి .యుగంధర్, నాగవీర,భద్రం,సాంబ, ఐ.వి.బాబు, గోపాల్,జ్యోతి,కె .వి .లూ



,రమణ,అల్లం,వై.వి.జి.రావు,మాధవి,యం వి.రావు,లక్ష్మీ,కుమార్,రమణమ్మ,ప్రమీల,సుమన్ ,నారాయణ,చిట్టి బాబు,పి. యస్.నారాయణ,వెంకన్న,మధుకర్,ఎం .టీ .టీ .రావు,రమేష్,
చందర్,బిక్కు,రామకృష్ణ,విజయలక్ష్మి రమణమ్మ,అప్రోజ్,నాయక్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.వివిధ డిపోల అధ్యక్ష,కార్యదర్శులు, అత్యధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. అభివందనాలతో.. జున్ను.రవి రాష్ట్ర కార్యదర్శి ఖమ్మం రీజియన్ తెలంగాణ మజ్దూర్ యూనియన్

# ఆలేరులో ఓటరు జాబితా సమీక్ష

- 99 శాతం పూర్తి చేసిన బూత్ స్థాయి ప్రతినిధులకు రూ.5 వేల ప్రోత్సాహకం
- తెలంగాణ కాంగ్రెస్ పీసీసీ ప్రధాన కార్యదర్శి బుద్ధి రెడ్డి ప్రభాకర్ రెడ్డి

ప్రజాదివాస్

ఆలేరు నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పనుల పురోగతిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పనులను నిర్దేశిత గడువులో పూర్తిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గంలో 99 శాతం పనులు పూర్తిచేసిన బూత్ స్థాయి ప్రతినిధులను మంత్రి



అభినందించి, ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ప్రోత్సాహక నగదును అందజేశారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తిచేసి ఆలేరును రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా నిలపాలని మంత్రి సూచించారు. నియోజకవర్గ బాధ్యుడు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గ్రామాలు, బూత్‌ల వారీగా పనుల పురోగతిని వివరించి, కార్యకర్తల సమిష్టి కృషి వల్లే ఈ స్థాయి ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సారయ్య, డాక్టర్ లింగయ్య యాదవ్, ఈ.వి. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సీనియర్ నాయకులు, 500 మందికి పైగా బూత్ స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు. 99 శాతం పనులు పూర్తి చేసిన ప్రతినిధులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సన్మానించి ప్రోత్సాహక నగదును అందజేశారు.

# కాలయాపన కమిటీ వద్దు..
## కాలపరిమితి కమిటీ కావాలి...జీఎస్ ఆనంద్

- ఉద్యమకారులకు న్యాయం చేయకపోతే ఉద్యమమే
- కరీంనగర్ నుంచే ఉద్యమానికి శ్రీకారం

ప్రజాదివాస్

తెలంగాణ ఉద్యమకారుల పోరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో స్థానిక తారక హోటల్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా చైర్మన్ జీఎస్ ఆనంద్ మాట్లాడుతూ, ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ కాలయాపన కమిటీగా కాకుండా కాలపరిమితితో పనిచేసే కమిటీగా వ్యవహరించాలని సూచించారు. కమిటీ సభ్యులు వీలైనంత త్వరగా ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని కలిసి ఉద్యమకారుల సమస్యలు, బాధలను వివరించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఉద్యమకారుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం చేస్తే ఉద్యమాలకు సిద్ధమవుతామని, ఆ ఉద్యమం కరీంనగర్ నుంచే ప్రారంభమవుతుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షుడు కలర్ సత్తన్న గౌడ్, నగర అధ్యక్షుడు గోడిశల రమేశ్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి బొల్లం



లింగమూర్తి, కడారి ఐలన్న, మెతుకు సత్యం, కొండ్రా కుమార్, రవి యాదవ్, దావేర మహేశ్, గంగిపల్లి సతీష్, తోట రాకేష్, ప్రసాద్, పెద్దపల్లి మధుసూదన్, ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు ఓగేటి బిందు, కారంగుల సుజాత, గడ్డం లత, తుమ్మనపల్లి రేణుక, కొరిమి పద్మ, ఉప్పరి శారద తదితరులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతల నిర్మాణంకు ముగ్గులు పోయించిన సర్పంచ్ పగడాల





ప్రజాదివాస్

దమ్మపేట గ్రామ పంచాయతీ పరిధిలో 200 ఇంకుడు గుంతల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్న సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు సోమవారం 13వ వార్డు సభ్యులు చాట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మల్లారం కాలనీలో ఇంకుడు గుంతల నిర్మాణాలకు సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్ తో ముగ్గు పోయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటిని అవసరమైన వరకు వాడి, వృథా చేయకుండా, వాడిన నీరుని, వర్షపు నీరుని వ్యర్థంగా పోకుండా భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతను ఏర్పాటు చేసి భూగర్భ జల మట్టాన్ని ప్రతీ ఒక్కరూ పెంచడానికి కృషి చేయాలి అన్నారు. తద్వారా పర్యావరణం, భవిష్యత్ తరాలను సంరక్షించిన వాళ్ళు అవుతాం అన్నారు. నీటి సంరక్షణ కోసం సాధారణ ఇళ్ల వద్ద ఇంకుడు గుంత నిర్మాణం చేసుకునేవారికి రూ. 6,000 వరకు అంచనా వ్యయం కింద ప్రభుత్వం చెల్లిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో పానుగంటి లక్ష్మణ్ గౌడ్, చిన్నశెట్టి ముక్తేశ్వరరావు, గొల్లపల్లి వెంకటేష్, పగడాల గోపి తదితరులు ఉన్నారు.

# చిట్టిబాబుగా వెంకటేశ్.. 'ఆదర్శ కుటుంబం' ఇదే




వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న సరికొత్త చిత్రం 'ఆదర్శ కుటుంబం - హౌస్ నెం.47'. శ్రీనిధిశెట్టి కథానాయిక. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీకి సంబంధించి చిత్ర బృందం ఆసక్తికర అప్‌డేట్‌ను పంచుకుంది. 'ఆదర్శ కుటుంబం' ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయడానికి సిద్ధమైంది. జులై 27న స్పెషల్ అప్‌డేట్‌ను పంచుకోనుంది. ఈ సందర్భంగా కీలక నటులు ఏయే పాత్రల్లో కనిపించనున్నారో తెలియజేసింది. ఇందులో చిట్టిబాబు అనే పాత్రలో ఇద్దరు బిడ్డల తండ్రిగా వెంకటేశ్ నటిస్తున్నారు. స్వర్ణగా శ్రీనిధి శెట్టి, సంపూర్ణగా యువిన పార్వతి, శర్వాగా రాజ్ ప్రజ్వల్ నటిస్తున్నారు. జులై 27న ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది. అక్టోబరు 2న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు నిర్మాత నాగవంశీ తెలిపారు. కుటుంబ అంశాలతో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో వెంకటేశ్ మధ్యతరగతి కుటుంబ పెద్దగా కనిపించనున్నారు. 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' సినిమాలకు త్రివిక్రమ్ స్క్రిప్ట్‌ని అందించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమాకోసం ఎదురు చూసిన ప్రేక్షకులకు 'ఆదర్శ కుటుంబం'తో ఆ కల నెరవేరనుంది.

## ఆ హిట్ తర్వాతే నాపై నమ్మకం పెరిగింది: అదా శర్మ

'ది కేరళ స్టోరీ' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు అందాల తార అదా శర్మ. భారీ హిట్ కొట్టిన తర్వాత హీరోయిన్లకు మంచి పాత్రలు దక్కవనే ప్రచారంలో నిజం లేదని ఆమె స్పష్టం చేశారు. ఆ సినిమా విజయంతోనే తనకు మరిన్ని మంచి అవకాశాలు వస్తున్నాయని తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. "ఒక హిట్ పడితే.. మన నటనపై అందరికీ నమ్మకం పెరుగుతుంది. భారీ ప్రాజెక్టుల్లో అవకాశాలు ఇస్తారు. ప్రస్తుతం ప్రతి నటి కోరుకునే డ్రీమ్ రోల్స్ నాకు వస్తున్నాయి. సవాలుతో కూడిన, విభిన్నమైన పాత్రలు దక్కుతున్నాయి" అని చెప్పారు. చిట్టిబాబుగా వెంకటేశ్.. 'ఆదర్శ కుటుంబం' ఇదే 2008లో '1920' అనే హిందీ హారర్ సినిమాతో అదా శర్మ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. టాలీవుడ్‌లో 'హార్ట్ ఎటాక్', 'సన్ ఆఫ్ సత్యమూర్తి', 'క్షణం' లాంటి హిట్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. అలాగే బాలీవుడ్ చిత్రం 'హసీ తో ఫసీ'తో పాటు, విద్యుత్ జమ్వాల్ 'కమాండో' సిరీస్‌లోనూ ఆకట్టుకున్నారు. ఇటీవల మనోజ్ బాజ్‌పాయ్‌తో కలిసి 'గవర్నర్' అనే మూవీలో నటించారు. చిన్మయ్ డి.మాండ్లేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం.. 1990 నాటి భారత ఆర్థిక సంక్షోభం, ఆర్బీఐ-ప్రభుత్వం మధ్య జరిగిన పరిణామాల నేపథ్యంతో తెరకెక్కింది. మరోవైపు, ఆమె 'గజ్రా' అనే చిత్రంతో మరాఠీ పరిశ్రమలోకి అడుగుపెట్టనున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా శ్రేయాస్ జాదవ్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది.



## యశ్‌కి నేను పెద్ద అభిమానిని: రణ్‌బీర్ కపూర్



యశ్‌కి తాను పెద్ద అభిమానినని బాలీవుడ్ అగ్ర కథానాయకుడు రణ్‌బీర్ కపూర్ అన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. 'రామాయణ' లో రావణుడి పాత్రలో యశ్ ఒదిగిపోయిన తీరుపై ప్రశంసలు కురిపించారు. అలాగే, వీరిద్దరి మధ్య వచ్చే కీలకమైన క్లైమాక్స్ సన్నివేశాల షూటింగ్ ఇంకా జరగలేదని వెల్లడించారు. "రామాయణ' సినిమా చివర్లో రాముడు, రావణుడు ఇద్దరూ ఒకరికొకరు ఎదురుపడే సన్నివేశాలు ఉంటాయి. అవి మేం ఇంకా చిత్రీకరించలేదు. ఎప్పటినుంచో నేను యశ్ కు చాలా పెద్ద అభిమానిని. రావణుడి పాత్రలో ఆయన ఒదిగిపోయిన తీరు నాకేంతో నచ్చింది. ఇప్పటివరకు మనం చూసిన రావణుడి పాత్రలకు భిన్నంగా యశ్ ఈ పాత్రను పోషిస్తున్నారు. తనదైన స్వాగ్, ఆరా, నిజాయితీతో రావణుడి పాత్రకు ప్రాణం పోశారు. ఇది ఇంతకుముందు రావణుడి పాత్రలా అస్సలు ఉండదు" అని అన్నారు. ఈ ప్రాజెక్ట్ గురించి యశ్ మాట్లాడుతూ.. "అద్భుతమైన కథను సరైన విధానంలో ప్రేక్షకులకు చూపించడానికే మా బృందం ప్రయత్నిస్తోంది. సరైన బృందం ఉంటే అన్నీ వాటంతట అవే సర్దుకుంటాయి. మేకప్, లుక్స్, సాంకేతికత పరంగా ఈ సినిమా కోసం మేం ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాం. ఇదొక అద్భుతమైన కథ. దీన్ని అత్యంత సహజంగా మీ ముందుకు తీసుకురావడానికి మా వంతు కృషి చేస్తున్నాం " అని పేర్కొన్నారు. ఇక, నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఎంతోమంది ప్రముఖ నటీనటులు భాగమయ్యారు. రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీదేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇక, 'రామాయణం పార్ట్ 1' ఈ ఏడాది దీపావళికి విడుదల కానుండగా.. రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'శ్రీనివాస మంగాపురం'.. ఆల్ ది బెస్ట్ చెప్పిన మహేశ్ బాబు



అగ్ర నటుడు మహేశ్‌బాబు 'శ్రీనివాస మంగాపురం' చిత్రబృందానికి ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. చాలా సంతోషంగా ఉందంటూ ఒక వీడియో పోస్ట్ చేశారు. "చాలా ఆనందంగా ఉంది. జయకృష్ణ హీరోగా నటిస్తున్న ఈ సినిమా కోసం మా కుటుంబమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ మూవీ ట్రైలర్, పాటలు బాగున్నాయి. అజయ్ భూపతికి ఈ క్రెడిట్ దక్కాలి. నటీనటులను ఆయన అంత బాగా చూపించారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్ చక్కటి సంగీతాన్ని అందించారు. అందులో నాకు 'అలెల్లే అలెల్లే' పాట బాగా నచ్చింది. నేను, అల్లు అర్జున్, రామ్‌చరణ్ మేమంతా వైజయంతి బ్యానర్‌పైనే పరిశ్రమలో అడుగుపెట్టాం. అలాంటి ప్రతిష్టాత్మక సంస్థ ద్వారా జయకృష్ణ వెండితెరకు పరిచయమవుతుండటం సంతోషంగా ఉంది. అభిమానులు జయకృష్ణని, రషాని ప్రోత్సహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మొత్తం చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్ " అని మహేశ్ వీడియోలో పేర్కొన్నారు. జయకృష్ణ ఘట్టమనేని హీరోగా, అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. రషా థడానీ కథానాయిక. ఈ మూవీ జులై 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## నటుడు రమేశ్ కుటుంబానికి అండగా నిలిచిన చిరంజీవి




హైదరాబాద్: తోటి కళాకారులు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకునేందుకు ముందుండే ప్రముఖ నటుడు చిరంజీవి మరోసారి పెద్ద మనసు చాటారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతున్న నటుడు రమేశ్ కుటుంబానికి అండగా నిలిచారు. 'గబ్బర్ సింగ్'తో పాటు పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించిన నటుడు రమేశ్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న చిరంజీవి అపోలో ఆసుపత్రి డాక్టర్ సుబ్బారెడ్డితో మాట్లాడి రమేశ్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. చికిత్సకు అవసరమైన సాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రమేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన.. చికిత్స ఖర్చులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో అతని సతీమణికి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం ద్వారా అవసరమైన సహాయం అందేలా సిఫార్సు చేస్తామని చిరంజీవి హామీ ఇచ్చారు. చిరంజీవి సోదరుడు నాగబాబు తన వంతు సాయంగా రమేశ్ కుంటుంబానికి రూ.2లక్షల చెక్కును అందించారు. రమేశ్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితంలోకి రావాలని చిరంజీవి ఆకాంక్షించారు.



## 'బేబి'కంటే గొప్పగా చెన్నై లవ్‌స్టోరీ

"సినిమా బాగుంటుందని నేను చెప్పిన ప్రతిసారీ ప్రేక్షకులు నమ్మి థియేటర్‌కి వస్తున్నారు. 'చెన్నై లవ్‌స్టోరీ' ముందస్తు ప్రదర్శనలు మొదలుకొని హౌస్‌ఫుల్ బోర్డులతో ప్రదర్శితం అవుతుండడం చూశాక ఎంతో ఆనందం కలుగుతోంది" అన్నారు కిరణ్ అబ్బవరం. ఆయన కథానాయకుడిగా, రవి నంబూరి తెరకెక్కించిన 'చెన్నై లవ్‌స్టోరీ' శుక్రవారమే ప్రేక్షకుల ముందుకొచ్చింది. చిత్రబృందం శనివారం హైదరాబాద్‌లో విజయోత్సవాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా కథానాయకుడు కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "మా ప్రేమకథపై ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు. ప్రతి ప్రేమకథ ఒకేలా ఉంటే చరిత్రకు కూడా నచ్చదు. మాది కొత్త ప్రేమకథ. కుటుంబంతో కలిసి సినిమాని ఆస్వాదించాలని కోరుతున్నా. ఇందులోని నివి పాత్రకి అందరూ కనెక్ట్ అవుతున్నారు. నేను పోషించిన స్టీవెన్ శంకర్ పాత్ర గురించీ అందరూ గొప్పగా చెబుతుంటే ఆనందంగా ఉంది" అన్నారు. శ్రీగౌరీప్రియ మాట్లాడుతూ "సింగిల్ స్క్రీన్స్‌లోనూ, మల్టీప్లెక్స్‌ల్లోనూ ఒకే రకమైన స్పందన కనిపిస్తోంది. అన్ని వయసులవాళ్లూ థియేటర్లలో కనిపిస్తున్నారు. ప్రేక్షకులందరినీ ఒక్కటి చేసేదే మంచి సినిమా అనిపించింది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "తొలి సినిమాతోనే ఘన విజయం అనేది ప్రతి దర్శకుడూ కనే కల. అది సాకారమైనందుకు ఎంతో ఆనందం కలుగుతోంది" అన్నారు. కథా రచయిత, చిత్ర నిర్మాతల్లో ఒకరైన సాయిరాజేశ్ మాట్లాడుతూ "ఒక మంచి సినిమాకి అన్నీ కలిసొస్తాయని మరోసారి రుజువైంది. నేను కథా రచయితనైనా నాకంటే బాగా ఈ కథని అర్థం చేసుకుని తెరకెక్కించాడు రవి నంబూరి. 'బేబి' తర్వాత మా గౌరవాన్ని పెంచే సినిమానే చేయాలనుకున్నాం. దానికంటే గొప్ప సినిమాని చేశామ"న్నారు. మరో నిర్మాత ఎస్.కె.ఎన్. మాట్లాడుతూ "కుటుంబ ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదనే అభిప్రాయాల్ని వింటుంటాం. మంచి కథ, సరసమైన టిక్కెట్ ధరలు ఉంటే కుటుంబ ప్రేక్షకులు, యువతరం సినిమాలకు బ్రహ్మరథం పడతారని మరోసారి మా సినిమా రుజువు చేసింది" అన్నారు. ఈ కార్యక్రమంలో సహ నిర్మాత ధీరజ్ మొగిలినేని, నటులు త్రిగుణ్, ప్రమోదిని, మహేందర్, గీత రచయిత అనంతశ్రీరామ్, ఛాయాగ్రాహకుడు విశ్వాస్ డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకథ రాయనున్న సూపర్‌స్టార్.. సినిమాగా కూడా రానుందా?



సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులకు ఓ శుభవార్త. ఆయన తన జీవిత ప్రయాణాన్ని ఆత్మకథ రూపంలో అభిమానులతో పంచుకోనున్నారని నెట్టింట వార్తలు తెగ చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై ఆయన బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోయినా, రజనీకాంత్ కొంతకాలంగా ఈ పుస్తకం రాసే పనిలో ఉన్నట్లు సమాచారం. ఆయన వ్యక్తిగత అనుభవాలు, వృత్తిపరమైన విజయాలు, అగ్రస్థానానికి చేరుకునేందుకు ఎదుర్కొన్న సవాళ్లు తదితర వివరాలన్నీ ఇందులో ఉండనున్నట్లు తెలుస్తోంది. కేవలం పుస్తకమే కాకుండా, ఈ ఆత్మకథను సినిమాగా (బయోపిక్) కూడా తీసుకురావాలని ఆయన భావిస్తున్నారట. ఈ ఆలోచనపై తనకు అత్యంత సన్నిహితులైన వారితో చర్చలు జరిపినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, పుస్తకం లేదా సినిమాపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఇక, రజనీకాంత్ వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'జైలర్ 2' చిత్రంలో ఆయన నటిస్తున్నారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 15న విడుదల కానుంది. ప్రస్తుతం 'ధర్మన్' మూవీ షూటింగ్‌లో ఆయన పాల్గొంటున్నారు.